కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 19, క్యాప్సికమ్ 31, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

గన్‌పార్కు వద్ద రేపు ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: గన్‌పార్కు వద్ద సోమవారం నిర్వహించనున్న మిలీనియం మార్చ్‌డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ విద్యార్థి, ఉద్యమకారుల వేదిక వేదిక అధ్యక్షులు కంచర్ల బద్రీ శనివారం పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు లుంబినీ పార్కు వద్ద గల అమరవీరుల జ్యోతి నుంచి గన్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ అమరులకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగాలి



లాలాపేట: లాలాపేట వినోభానగర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో భారతదేశపు మొట్టమొదటి మహిళా ఆడియో ఇంజనీర్ సాజిదా ఖాన్, సీలింగ్ స్పోర్ట్స్ నేషనల్ ప్లేయర్ ధరణి, నిర్మాణ ఫౌండేషన్ వీరమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్యసాధనకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదిరించి ముందుకు వెళుతూ విజయ తీరాలను చేరుకోవాలని కోరారు.

చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ ఫలితాలు నిలిపివేయాలి

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్ 1,2,3 పాటు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలు నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదిగ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సూరారం సుజాత ఆధ్వర్యంలో పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బొర్ర భిక్షపతి మాట్లాడుతూ మహిళల కోసం పాటుపడిన మహిళా మూర్తులను, వారి హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహనీయులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు రేణుక, దుర్గా బాయి, సరోజ, లక్ష్మి, సరోజిని, అంబికా, కన్యాకుమారి పాల్గొన్నారు.

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

ఆరు బృందాలతో పోలీసుల వేట

అడ్డగుట్ట: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారని మూడు రోజుల వ్యవధిలోనే తన ప్రియురాలి తల్లి, సోదరిని హత్య చేసి పరారైన నిందితుడి కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. యూపీకి చెందిన అరవింద్ కుమార్(45) రైల్వే ఉద్యోగి లక్ష్మి(40)తో వివాహేతర సంబధం పెట్టుకున్నాడు. ప్రియురాలి తల్లి సుశీల, సోదరి జ్ఞానేశ్వరిని చంపేసి పరారయ్యాడు. దీంతో జంట హత్యలు చేసి పరారైన అరవింద్ కోసం ఇటు లాలాగూడ పోలీసులు, అటు జవహర్ నగర్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్ఓటీ, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, సీసీఎస్ పోలీసులతో పాటు మరో రెండు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మి మాత్రం హత్యలకు గల కారణాలు సరిగ్గా చెప్పడం లేదని పోలీసుల నుంచి అందిన సమాచారం. హంతకుడు అరవింద్‌ను వీలైనంత తొందరగా పట్టుకొని నిజాలు బయటపెడతామని పోలీసులు చెబుతున్నారు.

మహిళా ప్రయాణికుల భద్రతే మా లక్ష్యం

అడ్డగుట్ట: మహిళా ప్రయాణికులకు సురక్షిత, సౌకర్యమైన ప్రయాణం కల్పించడమే తమ బాధ్యత అని సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆర్పీఎఫ్ పోలీసులు 'రోజ్ క్యాంపెయిన్' నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్లు, రైళ్లలో మహిళా ప్రయాణికులకు రోజా పువ్వులు ఇచ్చి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



రైల్వే స్టేషనలో రోజ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు



వనితా వందనం..

వాడవాడలా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు

సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. సాధికారత దిశగా మహిళలు అడుగులు వేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించే సంప్రదాయం ప్రపంచదేశాల్లో ఒక్క భారతీయ సంస్కృతికే ఉందని నినదించారు.

బౌద్ధనగర్: వారాసిగూడలోని బుద్ధవిహార్‌లో శనివారం గృహకార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా డొమెస్టిక్ వర్కర్స్ స్టేట్ కోఆర్డినేటర్ జెనస్టస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. నాయకులు వల్లాల మంజుల, కల్పా. గీతాంజలి, మాధవి, స్వామి, అనురాధ, సబిత, ధనలక్ష్మి గృహ కార్మికులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం

అమీర్‌పేట: అమీర్‌పేటలోని డెంటల్ హౌజ్ వద్ద మహిళా పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ, డెంటల్ హౌజ్ నిర్వాహకులు హరి పాల్గొన్నారు.

గాయత్రీనగర్‌లో..

గాయత్రీనగర్‌లో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, లక్ష్మీ,దుర్గా,నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

రాంగోపాల్‌పేట్: మహిళలు స్వయం శక్తితో ఎదగాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ చుట్టలబస్తీలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నేడు అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకుని అందరూ ముందుకు వెళ్లాలని సూచించారు.

రసూల్‌పురా: బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న మూడవ వార్డు మడ్‌ఫోర్ట్‌లో కంటోన్మెంట్ బోర్డు స్వీపర్లకు చీరలను పంపిణీ చేశారు. రెండో వార్డు కృష్ణానగర్ కట్టమైసమ్మ బస్తీలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆర్పీలను శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

రాంగోపాల్‌పేట్: గ్లోబల్ గ్లోరీస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ వైఎంసీఏలో వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. మినిస్ట్రీ వ్యవస్థాపకురాలు రెవరెండ్ దాసరి గ్లోరి ఆనంద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు అందరూ కలిసి సందడి చేశారు. ముఖ్య అతిథిగా విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ కృపా స్వరూప రాణి హాజరయ్యారు.

బన్సీలాల్‌పేట్: బోయిగూడ ముదిరాజ్ సంఘంలో ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శారద ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ప్రముఖ డాక్టర్ రాధా రుక్మిణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాలతీ, సుమలత, స్వర్ణలత, ఇందిరా పాల్గొన్నారు.



బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి..



పారిశుద్ధ్య కార్మికురాలిని శాలువాతో సత్కరిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కె. హేమలత



బేగంపేట స్వామిరామానందతీర్థలో కార్పొరేటర్ మహేశ్వరి



యూనియన్ బ్యాంక్ సుందర్‌నగర్ బ్రాంచ్‌లో..



వేడుకల్లో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి



అంగన్‌వాడీ వర్కర్లను సన్మానిస్తున్న మార్కెట్ మాజీ చైర్మెన్ శ్రీనివాస్



దాసరి గ్లోరి ఆనందను సత్కరిస్తున్న దృశ్యం



డాక్టర్ రాధారుక్మిణీని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు



మహంకాళి పోలీస్ స్టేషన్‌లో...



మహిళలను సత్కరిస్తున్న ఎన్‌బీటీనగర్ అధ్యక్షుడు శేఖర్‌ముదిరాజ్



వారాసిగూడలోని బుద్ధ విహార్‌లో..




లాలాపేటలో..



అమీర్‌పేట : మహిళా కానిస్టేబుళ్లకు సత్కారం

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నేడు దివ్య తిరుకల్యాణ మహోత్సవం



సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్)లో శ్రీమదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

నేడు శ్రీవార్ల దివ్య తిరుకళ్యాణ మహోత్సవం..

ఆదివారం ఉదయం 10 గంటలకు సామూహికంగా దంపతులచే శ్రీవార్ల దివ్య తిరుకళ్యాణ మహోత్సవం కన్నులపండువగా జరుగుతుందని ఈఓ సత్యనారాయణ తెలిపారు. కళ్యాణ ఉత్సవంలో భాగంగా ఉదయం 5 గంటలకు శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమములు, రాజబోగం, తర్థగోష్టి, సాయంత్రం 6 గంటలకు తిరువీధుల్లో స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రసూల్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు శ్యాంకుమార్ అన్నారు. శనివారం తిరుమలగిరి గాంధీనగర్‌లో మల్లారెడ్డి హస్పిటల్ సహకారంతో శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఆర్థోపెడిక్, సాధారణ వైద్య పరీక్షలు, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ప్రతి బస్తీలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని శ్యాంకుమార్ తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రుక్మయ్య. పెరుమాళ్, చిన్నా, రాజారెడ్డి, ఉమేష్, సురేష్, మణి, జయ. అర్చన, రాగిణి, పద్మావతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

సనత్‌నగర్: మోడల్‌కాలనీ మానవ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మిత ఆహార వితరణ కేంద్రం వద్ద మహిళా దినోత్సవం సందర్భంగా మిత ఆహార వితరణతో పాటు చీరలను అందజేశారు. ఒకవైపు ఆకలి తీరుస్తూనే, ఇంకోవైపు మహిళలకు చీరలను అందజేయడం పట్ల ట్రస్ట్ సభ్యులను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్టీ బుచ్చిబాబుతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలా ఆక్రమణల తొలగింపు



అమీర్‌పేట: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో అమీర్‌పేట గాయత్రీనగర్‌లో నాలాను ఆక్రమించి ఉన్న నిర్మాణాలను అధికారులు తొలగించారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం పనులను పరిశీలించారు.

సందడి చేసిన మహిళలు

అమీర్‌పేట: బల్కంపేట ఎస్‌వీ మానిక్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అధ్యక్షులు ఆకుల రాంచందర్ లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో మహిళలకు ప్రాధాన్యం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. రసూల్‌పురా వల్లభాయ్‌పటేల్ నగర్ మినీ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకులు శాంసన్ రాజు ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు పెద్ద పీట వేస్తూ ఇందిరమ్మ క్యాంటిన్లు, పెట్రోల్ పంపులు, గ్యాస్ ఏజెన్సీలు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సులను కూడ మహిళా సంఘాలకు ఇప్పించి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్వప్న, కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపల్ సుధ, మహిళా మండలి అధ్యక్షురాలు యూసుబ్ భాను పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

స్నేహితుల ఘర్షణ.. ఒకరి మృతి

నిందితుడి అరెస్ట్

చిలకలగూడ: టాటూ విషయంలో స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఓ యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటనలో కర్రతో దాడి చేసి హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన మేరకు.. చిలకలగూడ ఠాణా పరిధిలోని శ్రీనివాసనగర్, మహ్మద్‌గూడ ప్రాంతాలకు చెందిన నగేష్, నర్సింగ్, శబరి, సాయి కిరణ్‌లు స్నేహితులు. వీరిలో బ్యాండ్ వాయించే నగేష్, డ్రైవర్ నర్సింగ్‌లు బంధువులు. ఈనెల 5వ తేదీ రాత్రి మిత్రులంతా కలిసి పార్శిగుట్టలోని ఓ వైన్‌షాపులో పూటుగా మద్యం సేవించారు. టాటూలు వేయడంలో ప్రావీణ్యం ఉన్న నగేష్ తెలిసిన వారికి టాటులు వేసి మిత్రుడు శబరికి టాటూ వేయలేదు. ఈ విషయమై వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వైన్‌షాపు మూసి వేసే సమయంలో మరికొంత మద్యం కొనుగోలు చేసి మహ్మద్‌గూడ ముత్యాలమ్మ ఆలయం వద్ద కూర్చున్నారు. టాటుల విషయమై మరోమారు ప్రస్తావనకు వచ్చింది. శబరి, నగేష్ వాదులాడుకుంటుండగా నర్సింగ్ కలుగజేసుకుని విడిపించాడు. ఈ క్రమంలో నగేష్, నర్సింగ్‌లు షర్టులు చిరిగిపోయాయి. నా షర్టునే చింపుతావా అంటూ అసభ్యపదజాలంతో నగేష్ దూషించడంతో మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన నర్సింగ్ కర్రతో నగేష్ తల, ముఖంపై దాడి చేశాడు. నగేష్‌ను మిత్రులు శబరి, సాయికిరణ్‌లు హుటాహుటిన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే నగేష్ (25) మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు నర్సింగ్, శబరి, సాయికిరణ్‌లను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. నర్సింగ్(25)పై మర్డర్ కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

మురుగు.. పరుగు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లో మురుగు నీరు వరదలా ప్రవహిస్తోంది. ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగు నీరు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బేగంపేట డివిజన్‌లోని ఈ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా రోడ్డుపై మురుగు నీరు పారుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పార్క్‌లేన్‌లోని సీటీసీ ఎదురుగా పొంగుతున్న మురుగునీరు

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఒరియంట్ స్పెక్ట్రా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన లభించినట్లు ఓరియెంట్ స్పెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో వివిధ దేశాల్లో ప్రసిద్ధిగాంచిన 50 యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా దేశాల్లో లభిస్తున్న కోర్సులు, ఉపకార వేతనాలు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

